# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శనివారం | 30 ఆగస్టు, 2025 | పేజీలు :08


## చదువుతో పాటు క్రీడలు ముఖ్యమే : కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీః** విధ్యార్థులు చదువుతో పాటు పలు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలలో నిర్వహించారు. హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్య ఎంత అవసరమో క్రీడలు అంతే ఉపయోగమని అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, ఆరోగ్యాన్ని కలుగజేస్తాయని పేర్కొన్నారు. క్రీడా పాఠశాలలో ప్రభుత్వం కల్పించిన సదుపాయాలను సద్వినియోగం చేసుకుని జాతీయ అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్ చంద్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా యువజన క్రీడా అధికారి శ్రీనివాస్ గౌడ్, ఒలంపిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రమేష్ రెడ్డి, టిఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి లక్ష్మణరావు ఉన్నారు.

# ఉప్పొంగిన ఉత్తరవాహిని..నీటిలో పొలాలు

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ఖానాపూర్ పట్టణంలో శివారులో గల గోదావరి నది ఉగ్రరూపాన్ని తలపిస్తుంది.ఎగువ శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గత రెండు రోజులుగా గోదావరి నీటిమట్టం అధికంగా ఉప్పొంగి ప్రవహిస్తోంది.మరీ తీరంలో ఉన్న స్మశాన వాటిక పూర్తిగా నీటిలో మునిగిపోయింది.గోదావరి తీరం వైపు ఎవరూ రావొద్దని స్థానిక అధికారులు,పోలీసులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.గోదావరి నది ఉప్పొంగి ప్రవహించడంతో దానికి ఉప వాగు అయినా రింకొనె వాగులోని నీరు గోదావరి నీరు రెండు కలిసి తీరా ప్రాంత పంట పొలాలను ముంచెత్తాయి.వరి నాట్లు వేసి వారం రోజులే గడుస్తున్న అధిక వర్షాల వల్ల తాము వేసిన వరి నాట్లు మునిగిపోయాయని గోదావరి,రెంకొనే వాగు పరిసర ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ నీరు ఎప్పుడు తగ్గుముఖం పడుతుందో తమ పొలాలు ఏ తీరుగా ఉన్నాయని రైతులు వాపోతున్నారు.గోదావరి తీరానికి ఆనుకొని ఉన్న మేడంపల్లి,సూర్జపూర్,బాధనకుర్తి,దిల్వార్పూర్,మల్లన్న పేట్,లింగాపూర్,బాబాపూర్ గ్రామాలలో సైతం పంట పొలాలు మునిగిపోయాయి.వర్షాలు లేకపోయినా ఎగువ నీరు రావడంతో తమ పంట పొలాలు అన్ని నీట మునిగిపోయాయని,ఈ నీరు ఎప్పుడు తగ్గుముఖం పడుతుందో అని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు,పోలీసులు గోదావరి తీరం వెంబడి ఉన్నటువంటి గ్రామాల ప్రజలను పశువుల కాపరులను తీరం వెంబడి అధిక వరద ఉన్నందువలన ఎవరు కూడా అటువైపు వెళ్ళవద్దని హెచ్చరిస్తున్నారు.గోదావరికి సమీపంలో ఉన్న ఎల్లమ్మ గుడి చుట్టూ వరద నీరు చేయడంతో చాలా సంవత్సరాలకి మళ్లీ ఇంతలా గోదావరి నీరు ఉప్పొంగి ప్రవహిస్తుందని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు.




## మానేరులో గల్లంతయిన వ్యక్తి ఆచూకీ కోసం
## ప్రత్యేక సెర్చింగ్ ఆపరేషన్ టీమ్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఎగువ మానేరు వద్ద వాగును దాటుతున్న క్రమంలో గల్లంతైన వ్యక్తి ఆచూకీ కనిపెట్టేందుకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఆదేశాల మేరకు ప్రత్యేక ప్రత్యేక సెర్చింగ్ ఆపరేషన్ టీంను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎగువ మానేరు వద్ద వాగును దాటుతున్న క్రమంలో గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన పంపుకాడి నాగయ్య బుధవారం గల్లంతు అయ్యారు. ఆయన ఆచూకీ కనిపెట్టేందుకు రెవెన్యూ, పంచాయతీ రాజ్, పోలీస్, నీటి పారుదల, మత్స్య శాఖ అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఎగువ మానేరు ప్రవహించే మండలాల్లోని చెక్ డ్యాంలు, బ్రిడ్జిలు, కల్వర్టులు ఇతర ప్రాంతాల్లో తనిఖీలు చేయాలని సూచించారు. నర్మాల నుంచి గంభీరావుపేట వరకు, గంభీరావుపేట నుంచి మల్లారెడ్డిపేట వరకు, మల్లారెడ్డిపేట నుంచి ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ వరకు, వెంకటాపూర్ నుంచి సిరిసిల్ల వరకు, సిరిసిల్ల నుంచి మధ్య మానేరు రిజర్వాయర్ వరకు వెతకాలని ఒక్కో ప్రాంతానికి ఐదుగురితో కలిపి ప్రత్యేక టీంను ఏర్పాటు చేశారు. ఈ టీమ్ సభ్యులు వెంటనే తమ విధి నిర్వహణను మొదలు పెట్టాలని ఆదేశించారు.



## విధుల్లో అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పని చేసే ప్రతి ఒక్క అధికారి, ప్రభుత్వ సిబ్బంది తమ విధులను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కార్యాలయాల్లో ప్రతి ఫైల్ పకడ్బందీగా రికార్డు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. కార్యాలయంలో నిరుపయోగంగా (పాడైన) ఉన్న పాత స్కానర్ ,ప్రింటర్ మొదలైన సామాగ్రి తొలగించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలను ఎక్కువ సమయం ఎదురు చూసేలా చూడవద్దని, వారి దరఖాస్తులను మానవతా దృక్పథంతో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్,అధికారులుపాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం
### జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్



**ప్రజాపక్షం / ధర్మపురి :** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ సత్యప్రసాద్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్‌లో జరుగుతున్న వైద్య పరీక్షల వివరాలను, స్టాఫ్ అటెండెన్స్ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఫార్మసి విభాగంలో అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. రోగులకు కావాల్సిన మందులు అందుబాటులో ఉండేలా చూడాలని వైద్యులకు ఆదేశించారు.

## బిజెపి జిల్లా కార్యదర్శిగా మహీధర్ గౌడ్

**ప్రజాపక్షం/తాండూర్ :** బిజెపి మంచిర్యాల జిల్లా కార్యదర్శిగా రామగౌని మహీధర్ గౌడ్ నియమితులయ్యారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో కొత్త పదాధికారుల నియామకంలో భాగంగా ఆయనను నియమించారు. తాండూర్ మండల కేంద్రానికి చెందిన మహీధర్ గౌడ్ గతంలో బిజెపి మండల అధ్యక్షుడిగా పనిచేశారు. ఈ సందర్భంగా మహీధర్ గౌడ్ మాట్లాడుతూ జిల్లా కార్యదర్శి బాధ్యత నాపై ఉంచినందుకు రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తాను అని తెలిపారు. తనతో పాటు నియమితులైన ఇతర కొత్త పదాధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.

## వెంకటేశ్వర స్వామికి వెండి కిరీటాలు



**ప్రజాపక్షం/మామడ :** మామడ మండలంలోని కొరటికల్ గ్రామంలోని శ్రీదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలోని స్వామి వారికీ కొరటికల్ కిషన్ రావ్ కూతురు అల్లుడు బొందిడి స్రవంతి, కపిల్ 6.30 గ్రాముల గల మూడు వెండి కిరీటలు ఆలయ పూజారికి అందజేశారు.దేవాదాయ కమిటీ సభ్యులు వారిని సన్మానించి కృతజ్ఞతలు తెలియచేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో విడిసి సభ్యులు కిషన్ రావు కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చోరీ నిందితుడి అరెస్ట్

**ప్రజాపక్షం/మోర్తాడ్:**నిజామాబాద్ జిల్లా భీంగల్ పోలీస్ సర్కిల్ పరిధిలోని మోర్తాడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక నిందితుడిని అరెస్ట్ చేసినట్లు మోర్తాడ్ ఎస్ఐ రాము శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాలుగు రోజుల క్రితం మోర్తాడ్ మండల కేంద్రంలోని భగత్‌సింగ్ కాలానికి చెందిన గురుడి అమృత్ రావు ఇంట్లో గుర్తు తెలియని దొంగలు చోరికి పాల్పడ్డారన్నారు. 9మాసాల బంగారాం, ఐదు వేల నగదు చోరికి గురైనట్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. దొంగైన ఎర్ల అశోక్ ను అరెస్టు చేసి బంగారం రికవరి చేసి, అశోక్‌ను జైలుకు తరలించామని ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో భీంగల్ సిఐ పి.సత్యనారాయణ, ఎస్ఐ రాము, సిబ్బంది పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్లు అప్పగింత




**ప్రజాపక్షం/మోర్తాడ్:**నిజామాబాద్‌జిల్లా మోర్తాడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫోన్లు పోగోట్టుకున్న వారి ఫిర్యాదుల మేరకు సిఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి పోర్టల్ ఆధారంగా ఆరుగురి సెల్‌ఫోన్లు ఆచూకీని పోలీసులు తెలుసుకున్నారు. శుక్రవారం ఆ ఆరు సెల్‌ఫోన్లను రికవరీ చేసి ఆరుగురి ఫిర్యాదు దార్లకు అప్పగించామని మోర్తాడ్ ఎస్ఐ బి.రాము తెలిపారు.

# వరద బాధితులకు అన్నదానం చేయడం అదృష్టం



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** భారీ వర్షాలతో అతలాకుతలమై వరదతో అల్లాడుతున్న వాడీ గ్రామస్తులకు ఒకరోజు ఆహారమందించే అవకాశం రావడం నా అదృష్టమని డాక్టర్ అశోక్ అన్నారు. శుక్రవారం ధర్పల్లి మండదలం హోన్నాజీ పేట్ గ్రామంలో ముత్యాల చెరువు తెగిపోవటంతో వాడీ గ్రామంలోకి వరదనీరు ముచ్చెత్తింది. దీంతో గురువారం జిల్లా కలెక్టర్, సీపీ, ఎమ్మెల్యే సందర్శించి ముంపు గ్రామంలో ప్రజలను సురక్షిత గ్రామాలకు తరలించారు. కాగా వర్షం తగ్గడంతో గ్రామస్తులు ఇంట్లో బురదను చెత్తను తొలగించడం కోసం ఇంటి బాట పట్టారు. మంచినీరు లేక ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని గ్రామ యువకులు డాక్టర్ అశోక్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి ఆహారం కోసం 8 వేల రూపాయలతో భోజనం ఏర్పాటు చేయగా కాంగ్రెస్ మండల అధ్యక్షులు చిన్నబాల్‌రాజ్ మంచీనరు అందజేశారు. ఎల్దుర్తి కుటుంబ సభ్యులు, సీతాయిపేట తండా యువకులు సైతం సాయమందజేశారు. వాడీ ప్రజల ఇబ్బందులను అర్థం చేసుకుని సాయం అందజేసిన డాక్టర్ అశోక్, రవి, బాల్‌రాజ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయ నాయకులు, అధికారులు వచ్చి చూ ఎ లాంటి సాయం చేయలేదని, మా సమస్యను అర్థం చేసుకుని సాయం చేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షులు జిన్న సాయిలు, సంతోష్, లింగాపురం సాయిలు, నర్సయ్య, భాస్కర్, రాంచందర్, రమేష్, సాగర్, శ్రీకాంత్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## క్రీడలతోనే విద్యార్థుల సమగ్రాభివృద్ధి

**ప్రజాపక్షం / మంచిర్యాల రూరల్ :**క్రీడలు విద్యార్థులలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు మానసిక, శారీరకాభివృద్ధికి దోహదపడతాయని శ్రీ చైతన్య హైస్కూల్ ప్రిన్సిపాల్ సంజీవ్ తెలిపారు. శుక్రవారం జాతీయ క్రీడాదినోత్సవం (నేషనల్ స్పోర్ట్స్ డే)ను పురస్కరించుకుని మంచిర్యాలలోని శ్రీ చైతన్య హైస్కూల్‌లో వైభవంగా క్రీడా పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పాఠశాల ప్రాంగణం అంతా విద్యార్థుల కేరింతలతో మార్మోగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సంజీవ్ మాట్లాడుతూ క్రీడలు కేవలం వినోదం కోసం మాత్రమే కాకుండా, జీవితాన్ని విజయవంతంగా తీర్చిదిద్దేందుకు తోడ్పడతాయి. క్రీడల ద్వారా క్రమశిక్షణ, ధైర్యం, సమన్వయం, ఓర్పు వంటి విలువలు పెంపొందుతాయి. పాఠశాల స్థాయిలో క్రీడల్లో మెరుగైన ప్రదర్శన కనబరిస్తే భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుంది అని పేర్కొన్నారు. జోనల్ పిఇటి రాజేందర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడల్లో చురుకుగా పాల్గొనాలి. శారీరక శక్తి పెరగడం ద్వారా పాఠశాల చదువుల్లోనూ మెరుగైన ఫలితాలు సాధించవచ్చు అని తెలిపారు. అనంతరం క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ రవికుమార్, పిఇటిలు కుమార్, అక్షయ్, కుమార్, అనూష, రేఖ, ఎఓ విలాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వసతిగృహ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



**ప్రజాపక్షం /బెల్లంపల్లి :** ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య సూచించారు. శుక్రవారం బెల్లంపల్లి మండలంలోని బిసి ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాల వసతి గృహాన్ని సందర్శించి వంటశాల, భోజనశాల, వసతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి ఉపహారం తీసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య విద్యార్థులతో మాట్లాడుతూ మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని, ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని పట్టుదలతో కృషి చేయాలి అని అన్నారు. అనంతరం భీమిని మండలంలో ఉల్లాస్ కార్యక్రమంలో పాల్గొని 15 ఏళ్లు పైబడిన నిరక్షరాస్యులకు చదువు నేర్పించేందుకు వాలంటరీ టీచర్లు కృషి చేయాలని సూచించారు. నిరక్షరాస్యతను తగ్గించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి అభివృద్ధి అధికారి పురుషోత్తం నాయక్, ఎంపిడిఓ గంగా మోహన్, ఎంఇఓ కృష్ణ మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 9న నెరవేరని హామీలపై బహిరంగసభ



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందిళ్ల మల్లేష్ విమర్శించారు. సెప్టెంబర్ 9న హైదరాబాదులో ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దానిలో భాగంగా సెప్టెంబర్ 6న మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. శుక్రవారం శ్రీరాంపూర్‌లోని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ భవనంలో నిర్వహించిన సదస్సులో ఎంఆర్‌పిఎస్, ఎంఎసిపి, విహెచ్‌పిఎస్ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ వికలాంగులకు రూ.6 వేల పెన్షన్, వితంతువులకు, వృద్ధులకు, ఒంటరి మహిళలకు రూ.4 వేల పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోవడం దారుణమని అన్నారు.

## గణనాథుడికి కుంకుమ పూజలు



**ప్రజాపక్షం / తాండూర్ :** వినాయక నవరాత్రుల సందర్భంగా తాండూర్ గ్రామంలోని శ్రీ భక్త మార్కండేయ శివాలయం, గణేష్ నగర్, అశోక్ నగర్ మండపాల వద్ద శుక్రవారం మహిళలు భారీగా పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో గణనాథుడికి కుంకుమపూజలు చేసి ప్రత్యేక అర్చనలు చేశారు. ప్రతీ ఏటా జరిగే ఈ పూజల్లో పాల్గొనడం ద్వారా ఆనందంతో పాటు ఆధ్యాత్మిక శాంతి కలుగుతోందని మహిళలు తెలిపారు.



**ప్రజాపక్షం / మందమర్రి :** మందమర్రి టి నగర్ కాలనీలో శ్రీ గణపతి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. 1986లో సింగరేణి కార్మికుల ఆధ్వర్యంలో స్థాపించిన వినాయక మండపంలో శుక్రవారం మూడో రోజు అమ్మవారికి కుంకుమపూజను మహిళాభక్తులు శ్రద్ధాభక్తులతో నిర్వహించారు. స్వరూప, ఆదిలక్ష్మి , కృష్ణవేణి, రమణకుమారి, సరిత, శ్రీలత, సుజాత తదితర మహిళలు పూజల్లో మంగళారతులు సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీ కమిటీ సభ్యులు, భక్తులు నామస్మరణలో మునిగి గణనాథుడిని ప్రార్థించారు. ఆయురారోగ్య ఐశ్వర్యాలు ప్రసాదించి, సమస్త కష్టాలను తొలగించు అని సమష్టిగా ప్రార్థించారు.


## శిక్షణకు వివరాల నమోదు

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** జిల్లా కేంద్రంలోని టాస్క్ కార్యాలయంలో ప్రముఖ టెక్నికల్ కోర్సుల శిక్షణకు అర్హత కలిగిన అభ్యర్థులు నమోదు చేసుకోవాలని టాస్క్ ఇన్‌చార్జ్ రాకేష్ తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ జావా, పైథాన్, వెబ్ డెవలప్‌మెంట్, డేటాబేస్, సూడో కోడ్, సి, సి++, హెచ్‌టిఎమ్ఎల్, సిఎస్ఎస్, జావాస్క్రిప్ట్, ఆప్టిట్యూడ్‌రీజనింగ్, సాఫ్ట్ స్కిల్స్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. డిగ్రీ ఉత్తీర్ణత కలిగిన అభ్యర్థులు సెప్టెంబర్ 1, 2, 3 తేదీల్లో జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ భవన సముదాయంలోని టాస్క్ కేంద్రాన్ని సంప్రదించి తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

## ప్రత్యేక శానిటేషన్ తప్పనిసరి

**ప్రజాపక్షం / తాండూర్ :** వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో ప్రత్యేక శానిటేషన్ పనులు తప్పనిసరిగా చేపట్టాలని తాండూర్ మండల పంచాయతీ అధికారి అనిల్ కుమార్ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం ఆయన రేచిని, గోపాల్ నగర్ గ్రామపంచాయతీలను ఆకస్మికంగా పరిశీలించారు. పంచాయతీల రిజిస్టర్లు, రికార్డులు సరిచూసి పారిశుద్ధ్య పనులపై సమీక్ష నిర్వహించారు. రిజిస్టర్లు ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని కార్యదర్శులను ఆదేశించారు. మురికి కాలువలను తరచూ శుభ్రం చేయించడం, రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగించడం వంటి చర్యలు చేపట్టాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రేచిని కార్యదర్శి శ్రీనివాస్, గోపాల్ నగర్ ఇన్చార్జ్ కార్యదర్శి లక్ష్మణ్ పాల్గొన్నారు.

# 'బోసి' గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



**ప్రజాపక్షం/తానూర్ :** ప్రతి సంవత్సరం గ్రామాలలో గల్లి,గల్లికి విస్తరిస్తున్న ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్(పిఓపి) వినాయక విగ్రహాల ప్రతిష్టాపన చేస్తున్న ఈ కాలంలో దాదాపు 62 సంవత్సరాలుగా పర్యావరణాన్ని పరిరక్షణ చేస్తూ ఒక గ్రామంలో ఒకే ఒక్క వినాయక ప్రతిష్టాపన చేస్తూ ఐక్యతను చాటుకుంటున్నారని,అందుకు చక్కటి ఉదాహరణ మండలంలోని బోసి,గ్రామమే అని,ఈ గ్రామాన్ని భైంసా డివిజన్ ప్రజలు ఆదర్శంగా తీసుకోవాలని ఏఎస్పీ అవినాష్ కుమార్ అన్నారు.శుక్రవారం వరసిద్ధి కర్ర వినాయకుని ఆయనతో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనందరావు పటేల్,ఎస్ఐ జుబేర్,దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.బాల గంగాధర్ తిలక్ 1983 లో గణేష్ ఉత్సవాలను ప్రారంభించారని,అందరూ కలిసిమెలిసి ఉండి ఉత్సవాలను నిర్వహించుకోవాలని ఏఎస్పి తెలిపారు.అనంతరం ఆలయ కమిటీ,గ్రామ కమిటీ,వారు వారిని శాలువలు వేసి సన్మానం చేశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు ఉతమ్ బాలేరావు,మాట్లాడుతూ..భక్తుల కోరిక కోరికలు తీర్చే వరసిద్ధి కర్ర వినాయకుని 62 సంవత్సరాల క్రితం నిర్మల్ పట్టణానికి చెందిన పాలకొండ గుండాజీ,ఈ వినాయకుని కర్రతో తయారు చేశారని,ఈ సంవత్సరంలో 62 సంవత్సరాలు కావస్తుందని,మహారాష్ట్రలోని పాలజ్,చిక్లి,పట్నంలో ఉన్న వినాయకులను ఆయననే చెయ్యడం విశేషం అని..బోసి,గ్రామంలో అన్ని కులాలకు చెందినవారు గ్రామంలో ఉండగా ఈ పండుగను అందరూ కలిసిమెలిసి జరుపుకుంటామని,11 రోజుల పాటు కర్ర వినాయకుని ప్రత్యేక పూజలు,గ్రామ కమిటీ,గ్రామస్తుల,సాయంతో అన్నదాన కార్యక్రమం,రాత్రి వేళల్లో సంస్కృతిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని,గ్రామస్తులు అందరూ కలిసి వరసిద్ధి కర్ర వినాయకునితో పాటు నిమజ్జనం చేసే 11వ రోజు చిన్న గణపతి విగ్రహాన్ని పెడతారు.నిమజ్జనం రోజున వరసిద్ధి కర్ర వినాయకునికి చెరువు నీటిని చల్లి,చిన్న గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేయడం జరుగుతుందని,ఆ తర్వాత వరసిద్ధి కర్ర వినాయకునికి మహాదేవ మందిరంలో భద్రపరుస్తారు.వచ్చే సంవత్సరం నవరాత్రి ఉత్సవాలలో మాత్రమే ఆ విగ్రహాన్ని తీస్తారు.ఇతర సమయాలలో బయటకు తీయకపోవడమే ఈ గ్రామం యొక్క ప్రత్యేకత అని అయన తెలిపారు.

## బొగ్గుగుడిసే ప్రాంతాన్ని సందర్శించిన ఎస్పి



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** మండలంలోని బొగ్గుగుడిసె ప్రాంతం గత రెండు రోజుల క్రీతం కురిసిన భారీ వర్షాలకు వరదమయమైంది. దీంతో అక్కడి వ్యాపార సముదాయాలు వరద ప్రవాహంలో నీటమునిగి కొట్టుకుపోయాయి. విషయం తెలుసుకున్న కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేశ్వర్‌శర్మ శుక్రవారం బొగ్గుగుడిసెకు చేరుకుని బాధితులతో మాట్లాడి నష్టం వాటిల్లిన వాటి వివరాలను తెలుసుకున్నారు. అక్కడ నుండి గోర్గల్ గేటు వద్ద ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఆయన సందర్శించి అక్కడ బిక్కుబిక్కుమంటు గడుపుతున్న మర్పల్లికి చెందిన పలువురిని పరామర్శించి వారికి ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. ఎస్పీ వెంట డీఎస్పీ విఠల్‌రెడ్డి, సీఐలు తిరుపతయ్య, రాజారెడ్డి, ఎస్సై శివకుమార్ తదితరులున్నారు.

## జిఒ60 ప్రకారం వేతనాలు చెల్లించాలి




**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు జిఒ నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు రాజేందర్, మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు మాట్ల రాజయ్య, కార్యదర్శి తోట సమ్మయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మేజర్ పంచాయతీని మున్సిపాలిటీగా మార్చి 17 నెలలు అయినా జిఒ నెంబర్ 60 ప్రకారం వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులను తగ్గించే ప్రయత్నం తప్ప, వేతనాల చెల్లింపుపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా కలెక్టర్ జోక్యం చేసుకుని వేతనాలు ఇప్పించాలని కోరారు. సిఐటియు నాయకులు, మున్సిపాలిటీ సిబ్బంది సంధ్య, పద్మ, ఇస్తారీ, సాగర్, ప్రభాకర్, నగేష్, లక్ష్మి, జగేరావు, గణేష్ పాల్గొన్నారు.

# వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్ :** పల్లె దవాఖానాలో వైద్య సిబ్బంది అందుబాటులో వైద్యం అందించాలని కాగజ్‌నగర్ ఎంపిడిఒ కోట ప్రసాద్ అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ మండలంలోని కోసిని గ్రామంలోని పల్లె దవాఖానాను ఆయన సందర్శించారు. దవాఖానలోని అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అని డాక్టర్‌ని అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల సమయం అయినందున పల్లెదవాఖానాల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు.అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పౌష్టికాహార సామాగ్రిని పరిశీలించారు. ప్రభుత్వం నుండి అందిస్తున్న కోడిగుడ్లు, పాలు, తదితర వాటిని పిల్లలకు సక్రమంగా పంపిణి చేయాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు శాతం పెంచాలని, వారికి సక్రమైన భోజనం అందించాలని కోరారు. అదే విధంగా గ్రామంలో పర్యటించి డ్రై డే కార్యక్రమాలు నిర్వహించి నిల్వ ఉన్న నీటిని తొలగింపచేసి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. వర్షాకాలం దృష్ట్యా ప్రజలు పరిశుభ్రత పాటించాలని సూచించారు. గ్రామంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని కార్యదర్శిని ఆదేశించారు. ఎంపిడిఒ వెంట పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్, అంగన్‌వాడీ కార్యకర్త గంగా భవాని, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## విద్యార్థుల ఉన్నతి కోసం పాటుపడాలి

**ప్రజాపక్షం/లక్ష్మణ్‌చందా :** లక్ష్మణ్ చందా మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాల నర్సాపూర్ డబ్ల్యూ,ఉన్నత పాఠశాల బాబాపూర్ లను జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు సందర్శించారు.మొదటగా ఆయన ప్రాథమికోన్నత పాఠశాల నర్సాపూర్ (డబ్ల్యు) నందు విద్యార్థుల యొక్క పఠన కౌశలాన్ని పరిశీలించారు.అనంతరం ఆయన వారితో మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాల విద్యా కేలండర్ ప్రకారం తరగతులు నిర్వహించాలని,విషయాలను భోదించాలని, అన్ని అంశాలను ఆన్లైన్లో తప్పకుండా నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులకు సూచించారు.తర్వాత ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డిజిటల్ పరికరాల ఆధారంగా అన్నీ తరగతులలోని వివిధ అంశాలను తెలియజేయాలని సూచించారు.అదేవిధంగా ప్రతి ఒక్కరూ కష్టపడే తత్వం,సేవ భావం అలవర్చుకోవాలని రైల్వే మెన్ అనే భోపాల్ గ్యాస్ దుర్ఘటన వీడియో చూయించి తెలియజేసారు.అలాగే గత తరగతిలోని అంశాలను పునశ్చరణ చేసుకొని,ప్రస్తుత తరగతిలో అభివృద్ధి కనబరచాలని తెలియజేశారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన సిబ్బందితో మాట్లాడి వారికి పలు సూచనలు చేయడం జరిగింది. మండల విద్యాధికారి అశోక్ వర్మ, జిల్లా విద్యాశాఖ సమన్వయకర్తలు రాజేశ్వర్, నర్సయ్య,ప్రవీణ్ కుమార్, లింబాద్రి, జిల్లా పరీక్షల బోర్డు సహాయ కార్యదర్శి భానుమూర్తి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాత ఉన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి




**ప్రజాపక్షం / లక్షెటిపేట :** రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ (ఎన్ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్ ప్రసాద్ పటేల్ డిమాండ్ చేశారు. శుక్రవారం లక్షెటిపేటలో జరిగిన ఎన్ఎస్ఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్‌లు రాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ఉన్నత విద్యకు పేద విద్యార్థులు దూరమవుతున్నారని తెలిపారు. సంక్షేమ వసతిగృహాల్లో ఆహార విషబాధ, సరైన వసతులు లేకపోవడం వల్ల ప్రతి ఏటా విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారని ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. విద్యాశాఖను ముఖ్యమంత్రి అధీనంలో ఉంచుకున్నప్పటికీ విద్యపై రివ్యూలు, బడ్జెట్ కేటాయింపులకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని విమర్శించారు. వెంటనే విద్యారంగానికి ప్రత్యేక మంత్రిని నియమించాలని, వర్షాకాలం నేపథ్యంలో అన్ని సంక్షేమ వసతి గృహాల్లో రెగ్యులర్ హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎఫ్ నాయకులు అభిలాష్, కార్తిక్, రాజేష్, క్రాంతి పాల్గొన్నారు.

## ఓరియంట్ ఎన్నికల్లో సత్యపాల్ విజయం



**ప్రజాపక్షం / కాసిపేట :** మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం దేవాపూర్ ఓరియంట్ ఎన్నికలు శుక్రవారం శాంతియుతంగా ముగిశాయి. ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్‌లో 266 మంది రెగ్యులర్ కార్మికుల్లో 265 మంది ఓటు వేశారు. ఒక్క సూరత్ చౌదరి మాత్రమే తన ఓటు వినియోగించలేదు. జిల్లా ఎంఎల్ఏ కుటుంబ సభ్యులు పోటీ చేయడంతో ఎన్నికలు ఉత్కంఠ రేపాయి. జిల్లా ఎంఎల్ఏ కొక్కిరాల ప్రేమ్ సాగర్ తమ్ముడు సత్యపాల్, చెన్నూరు ఎంఎల్ఏ వివేక్ బెల్లంపల్లి, ఖానాపూర్ ఎంఎల్ఏ గడ్డం వినోద్ మద్దతుతో బొజ్జు అభ్యర్థి విక్రమ్ ఎన్నికల్లో బరిలో నిలవడంతో పోటీ హోరాహోరీగా సాగింది. ఎన్నికల ఫలితాల సందర్భంగా డిసిపి భాస్కర్ ఆధ్వర్యంలో ఓరియంట్ అదాని సిమెంట్ కంపెనీ ప్రధాన గేట్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రం ఐదు గంటల వరకు ఓట్ల లెక్కింపు జరగగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. ఫలితాల్లో సత్యపాల్ 141 ఓట్లు సాధించి, తన ప్రత్యర్థి విక్రమ్‌పై 33 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. విక్రమ్‌కు 108 ఓట్లు, తాట్రా భీమ్ రావుకు 6 ఓట్లు వచ్చాయి. 9 షీల్డ్ కవర్ ఓట్లు, ఒక చల్లని ఓటు నమోదయ్యింది. విజయం అనంతరం సత్యపాల్ మాట్లాడుతూ, కార్మికుల్లో ధర్మమే గెలిచిందని, ధర్మానికి అధర్మానికి జరిగిన యుద్ధంలో ధర్మమే గెలిచిందని. మా అన్న కొక్కిరాల ప్రేమ్ సాగర్ వ్యవస్థ, ఆయనపై కార్మికులు ఉంచిన నమ్మకం నన్ను గెలిపించిందని అన్నారు. తన గెలుపుకు కృషి చేసిన అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## వినాయకునికి పూజలు

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మండలంలోని మాగి గ్రామ శివారులో గల జీఎస్ఆర్ చెక్కెర కర్మాగారంలో కార్మికులు, యాజమాన్యం కలిసి వినాయక నవరాత్రులను పురస్కరించుకుని గణపయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా ముందుగా అన్నదానం ఏర్పాటు చేసి ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో వినాయకుడిని ఊరేగింపు నిర్వహించి గ్రామశివారులోని మాంజీరాలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో జీఎస్సార్ షుగర్స్ కేన్ సీనియర్ జీఎం వెంగల్‌రెడ్డి, జీఎం రాజాబాబు, సుబ్బారెడ్డి, గోవింద్, పీఓ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ముంపు బాధితులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాపక్షం/నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టు వరదనీటి కారణంగా ముంపుకు గురైన ప్రాంతం మర్పల్లి గ్రామస్థులకు జహీరాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యుడు బీబీబపాటిల్ గ్రామస్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు. వరదనీరు మర్పల్లి గ్రామంలోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్న విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ తనవంతు సహాయంగా గ్రామస్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపి అధ్యక్షులు ఆసయిరెడ్డి, నగేష్, నాయకులు జగదీష్, అశోక్‌రాజ్, నవీన్, రవిచంద్ర, రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా తెలుగు భాషా వ్యవహారిక దినోత్సవం



**ప్రజాపక్షం/భీమ్‌గల్ రూరల్ :** గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా వ్యవహారిక దినోత్సవాన్ని భీమ్‌గల్ పట్టణ కేంద్రానికి చెందిన కొరవి గోపరాజు సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషా వ్యవహారిక దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఆగస్టు 29న జరుపుకుంటారు. ఆధునిక తెలుగు భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకటరామమూర్తి చిత్రపటానికి కంకణాల రాజేశ్వర్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి, కొరవ గోపి రాజు సాహిత్య సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కంకణాల రాజేశ్వర్ మాట్లాడుతూ గిడుగు వెంకట రామమూర్తి తెలుగు భాషను గ్రాంథిక భాష నుండి వాడుక భాషలోకి మార్చడంలో కీలకపాత్ర పోషించారు. ఆధునిక తెలుగు భాషా నిర్మాతల్లో గిడుగు ముఖ్యుడు, ఉపాధ్యాయుడు, చరిత్ర, శాసన పరిశోధకుడు, వక్త విద్యావేత్త గిడుగు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా పర్వతాలపేట గ్రామంలో 1863 లో గిడుగు రామమూర్తి జన్మించారు. ప్రభుత్వ ఉత్తర్వులు గ్రామీణ స్థాయి నుండి జిల్లా, రాష్ట్రస్థాయి వరకు సైతం జరిగే సమాచార సంప్రదింపులు ఆంగ్లంలో కాకుండా తెలుగులో అది ప్రజల వ్యవహార భాషలో జరిగినప్పుడే గిడుగు వారి కృషి సంపూర్ణంగా ఫలించినట్లు అవుతుందన్నారు. ఆచరణలో అలా జరిగినప్పుడే వారికి నిజమైన నివాళులిచ్చిన వారమవుతామని కంకణాల రాజేశ్వర్ అన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యవర్గ సభ్యులు తెలుగు భాషాభిమానులు పాల్గొన్నారు.

## వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యలు

**కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి వెల్లడి**

**ప్రజాపక్షం/బోధన్:** ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల వరద తాకిడికి గురైన ప్రాంతాలలో సహాయక చర్యలను ముమ్మరం చేశామని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. శ్రీ రాం సాగర్ బ్యాక్ వాటర్ కారణంగా జల దిగ్బంధంలో చిక్కున్న కొప్పర్గ, హంగర్గ, ఖాజాపూర్ గ్రామాలను కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. వరద తీవ్రతను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముంపునకు గురైన గ్రామాల ప్రజలను బోట్‌లు, ట్రాక్టర్లు, జేసీబీల సహాయంతో పునరావాస శిబిరాలకు, సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న తీరును కలెక్టర్ పరిశీలించారు. ఎక్కడ కూడా ప్రాణనష్టం వంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్నీ జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పునరావాస శిబిరాలలో ఆశ్రయం ఉంటున్న వారికి భోజనం, మంచినీరు వంటి సదుపాయాలు కల్పించాలని, ముంపు గ్రామాలలో ఎవరూ కూడా చిక్కుబడిపోకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలని సూచించారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో అధికారులు సిబ్బంది అందరూ వరద బాధితులకు సహాయంగా నిలుస్తూ, వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించాలని, ప్రభుత్వ యంత్రాంగం యావత్తు వారి వెంటే ఉందన్న భరోసాను కల్పించాలని హితవు పలికారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ కారణంగా ముంపునకు గురైన వరి, సోయా, పత్తి, కంది తదితర పంటలను కలెక్టర్ పరిశీలించారు. వరద నీటి ఉదృతి తగ్గిన వెంటనే క్షేత్రస్థాయిలో సర్వే జరిపించి పంట నష్టం అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపుతామని బాధిత రైతులకు తెలిపారు. ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు, 7వ బెటాలియన్ పోలీస్ బృందాలు సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగిస్తున్నాయని, వరద తగ్గిన వెంటనే దెబ్బతిన్న రోడ్లు, విద్యుత్ స్తంబాలు ట్రాన్స్ ఫార్మర్లు తదితర వాటికి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి సదుపాయాలు పునరుద్ధరిస్తామని అన్నారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఏసీపీ రామారావు తదితరులు ఉన్నారు.

## వరద బాధితులను ఆదుకుంటున్నాం

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** కాళేశరం ప్రాజెక్టు అతి పెద్ద స్కాండలని, గత కేసీఆర్ ప్రభుత్వం సుమారు లక్ష కోట్ల ఖర్చు పెట్టిన ప్రాజెక్టు నిర్వీర్యమైందని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. రూరల్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు వందేళ్లు ఉండాల్సిందని మూడేళ్లకోకే కూలిందని, గత ప్రభుత్వం తప్పు చేయలేదని బీఆర్ఎస్ అధ్యక్షులు కేసీఆర్, హరీష్‌రావు అంటున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై కమిటీ ఇచ్చిన నివేదిక అసెంబ్లీలో పెడుతున్నామని, కేసీఆర్, హరీష్‌రావులు దోషులుగా తేలారని, రేపు జరిగే అసెంబ్లీలో అసెంబ్లీ వేదికగా వారిద్దరి దోషులుగా నిలబెట్టబోతున్నామని భూపతిరెడ్డి తెలిపారు.

## ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి




**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లలో పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి మకరందం అన్నారు.శుక్రవారం సాయంత్రం పలు జిల్లాల అదనపు కలెక్టర్లతో ఆయన స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ప్రణాళిక పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని సదుపాయాలను సమకుర్చుకోవాలని తెలిపారు.ఇక్కడ కూడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఎన్నికల నిర్వహణ చేపట్టేందుకు అనిన చర్యలు తీసుకోవాలన్నారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ,అధికారులంతా స్థానిక సంస్థల ఎన్నికలు పకడ్బందీ ప్రణాళికలను రూపొందించాలని చెప్పారు.ఎన్నికల నిర్వహణకు సంబంధించి అవసరమైన సామాగ్రి మొత్తం సరిపడినంత సమకూర్చుకోవాలని అన్నారు. ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎన్నికలను నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.ఈ వీడియో కన్ఫరెన్స్ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో గోవింద్,జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్,ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్ల మరమ్మతులు తక్షణమే చేపట్టాలి



**ప్రజాపక్షం/కుంటాల :** భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్లతో పాటు నీట మునిగిన పంటల అంచనాలను రూపొందించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం మండలంలోని అందాకూర్ సమీపంలో భారీ వర్షాలతో కోతకు గురైన ప్రధాన రోడ్లు,పంటలను ఆమె పరిశీలించారు.వర్షాలకు దెబ్బతిన్న పంచాయతీరాజ్ రోడ్లకు మరమ్మతులు చేయాలని చెప్పారు.యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయడానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో అధికారులు ముందుకు సాగాలని,ప్రజల రవాణా సౌకర్యానికి ఎలాంటి ఇబ్బందులు రానివ్వొద్దని సూచించారు.ఎప్పటికప్పుడు అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఆస్తి ప్రాణ నష్టం జరుగకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఏవైనా ఇబ్బందులు తలెత్తితే సమాచారం ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఎన్ డి.ఆర్ ఎఫ్,ఎస్ డి ఆర్ ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.తహసీల్దార్ కమల్ సింగ్,స్థానిక అధికారులు తదితరులు ఉన్నారు.

## ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలి : బొజ్జు పటేల్



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ నియోజకవర్గంలో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు వరదలకు ఇబ్బందులకు గురైన గ్రామాలకు ప్రజలకు అధికారులు అప్రమత్తంగా ఉండి సేవ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అధికారులను ఆదేశించారు.గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ఖానాపూర్ నియోజకవర్గం లోని ఖానాపూర్,కడెం,పెంబి,దస్తురాబాద్ మండలాలకు సంబంధించిన వివిధ శాఖల అధికారులతో శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉప్పొంగిన చెరువులు వాగులు వంకలకు సంబంధించిన ఇరిగేషన్ అధికారులు సమీక్షించి వాటిని సరిహద్దుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.విద్యుత్ సమస్య పట్ల అధికారులు అప్రమత్తంగా పనిచేయాలన్నారు.అలాగే గ్రామాల్లో పట్టణాల్లో గల రోడ్లు వర్షాభావం వల్ల చెడిపోయిన వాటిని వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు.వర్షాలకు శిథిలమైన పూలు పైన పేదల ఇండ్లను గుర్తించి జాబితాలు తయారుచేసి వాళ్లకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని మండల రెవెన్యూ మండల పరిషత్ అధికారులను ఆదేశించారు.సదర్ మార్ట్,కడెం ప్రాజెక్టులపై పూర్తిస్థాయిలో శ్రద్ధ తీసుకొని నీటి ప్రవాహాలను గమనిస్తూ ఎప్పటికప్పుడు ప్రజలకు ఇబ్బంది కలగకుండా మెలగాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమాల్లో నాలుగు మండలాలకు సంబంధించిన అన్ని శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## తుది ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలి

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** గ్రామ పంచాయతీల సాధారణ ఎన్నికల నేపథ్యంలో తుది ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల ఆయన సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ,మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీలు,వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను ఇప్పటికే ప్రదర్శించామని తెలిపారు.ఈ జాబితాలపై అభ్యంతరాలను ఈ నెల 30వ తేదీ వరకు స్వీకరిస్తామన్నారు.ఆ తరువాత సెప్టెంబర్ 2న గ్రామ పంచాయతీ,వార్డు వారీగా ఫోటోలతో కూడిన తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామని స్పష్టం చేశారు.సర్పంచ్,వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా రాజకీయ పక్షాలు సహకరించాలని,ఓటరు జాబితాలు,పోలింగ్ కేంద్రాలపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా గడువులోగా సమర్పించాలని సూచించారు.అభ్యంతరాలను పరిశీలించి తుది జాబితాలో సవరణలు చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రవణ్ రెడ్డి,ఎంఐఎం నాయకుడు మజార్,బీఆర్ఎస్ నేత కోరిపెల్లి రాంకిషన్‌రెడ్డి,రమేష్,టీడీపీ రమేష్,వైఎస్ఆర్‌సీపీ నరేష్,ఆమ్ ఆద్మీ పార్టీ హైదర్ పాల్గొన్నారు.

## యూరియా సరఫరాలో విఫలం



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** జిల్లాలో రైతులు యూరియా అనేక ఇబ్బందులు పడుతున్నారని,యూరియా ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయానికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్.విలాస్,తెలంగాణ రైతు సంఘం అధ్యక్షుడు భూక్య రమేష్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో వచ్చి నుండి రైతులకు ఎరువులు సకాలంలో అందడం లేదని అధిక ధరలు పెంచి రైతులు నష్టి విడుస్తున్నారన్నారు.రెండు రోజుల నుంచి కురిసిన వర్షాల కారణంగా పంటలు భారీగా నష్టం జరిగిందని వెంటనే అధికారులు నష్టపరిహారం చెల్లించే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలని ఎకరానా చొప్పున 50వేల రూపాయలు చెల్లించాలన్నారు.ఎమ్మెస్ పాయింట్ లో పనిచేసే కూలీలందరికీ షరతులు లేకుండా అమాలి చెల్లించాలన్నారు.పంట పొలాల్లో ఇసుక మట్టలు పెట్టడం వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే ప్రభుత్వం వారిని గుర్తించి ప్రత్యేక సాయం కింద ఆర్థిక సాయం అందజేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆలిండియా కిసాన్ సభ అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి,అనంతరావు,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పారమిత విద్యాసంస్థలలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** కరీంనగర్ పట్టణంలోని పారమిత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినోత్సవం సంధర్భంగా పద్మనగర్ పారమిత పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్రీడా పతాకాన్ని ఎగురవేసి క్రీడా కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సంధర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన వివిధ క్రీడా కార్యక్రమాలలో గెలుపొందిన విధ్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. విధ్యార్థులు చేసిన వివిధ క్రీడా విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ సంధర్భంగా పారమిత విధ్యాసంస్థల అధినేత డా.ఇనుగంటి ప్రసాదరావు విధ్యార్థులకు, ఉపాధ్యాయులకు, రాష్ట్ర జాతీయ క్రీడాకారులకు క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. డైరెక్టర్లు ప్రసూ. రశ్మిత, అనూకర్ రావు, వినోద్ రావు, రాకేష్ , టియస్‌వి రమణ, వియుయం ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, బాలాజీ, గోపీ కృష్ణ, శ్రీకర్, శర్మిష్ట, కవిత, ప్రసాద్ సమన్వయ కర్తలు, ఉపాధ్యాయులు, పిఇటిలున్నారు.

## ఘనంగా కుంకుమ పూజ

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** కరీంనగర్ పట్టణం కిసాన్‌నగర్‌లోని విజ్ఞాన రాజా కమిటీ ఆద్వర్యంలో వినాయకునికి శుక్రవారం కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను తొమ్మిది రోజులు కన్నుల పండుగగా నిర్వహించడానికి తగిన కార్యచరణతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. శనివారం మహా అన్న ప్రసాద వితరణ, సోమవారం హోమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులందరూ ఈ కార్యక్రమాలలో పాల్గొని వినాయకుని ఆశీస్సులు పొందాలని కోరారు.

## బిర్లా ఓపెన్ మైండ్స్‌లో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** కరీంనగర్‌లోని బొమ్మకల్‌లో గల బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపల్ భబితా విశ్వనాథన్ , చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విధ్యార్థులు, క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. పాఠశాల మైదానంలో బాస్కెట్‌బాల్, ఆర్చరీ, లాన్ టెన్నిస్, అథ్లెటిక్స్, లాంగ్‌జంప్, ఖోఖో, త్రోబాల్, కబడ్డీ వంటి క్రీడలు నిర్వహించారు.

విధ్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సామర్థ్యాన్ని ప్రదర్శించారు. ఈ సంధర్భంగా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బంది,పెద్ద సంఖ్యలో విధ్యార్థులు పాల్గొన్నారు. క్రీడలు ఆరోగ్యకరమైన జీవనశైలికి బాటలు వేస్తాయని, విధ్యార్థులలో శారీరక , మానసిక అభివృద్ధికి తోడ్పడతాయని అతిథులు వ్యాఖ్యానించారు.

## అక్రమంగా మట్టి తరలింపు నిలిపివేయాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పాలకుర్తి మండలం కన్నాల శివారు సర్వే నెంబర్ 493, 494 లో సూర సంతోష్, మరి కొందరు వ్యక్తులు అక్రమంగా మట్టి తరలింపు నిలిపివేయాలని కన్నాల, జిడి నగర్ గ్రామాల ప్రజలు అధికారులను కోరారు. ఈ మేరకు పాలకుర్తి తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశామని పలువురు గ్రామస్తులు పేర్కొన్నారు. జెసిబిలు, ప్రోక్లెయిన్ ల తో ఎలాంటి అనుమతులు లేకుండా, ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకుండా పెద్ద ఎత్తున మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో మైనింగ్, రెవెన్యూ అధికారులు వచ్చి విచారణ జరిపారని అక్రమంగా మట్టి తరలింపు లెక్క తేల్చి జరిమానా వసూల్ చేయాలని గ్రామస్తులు కోరారు. సర్వే నెంబర్ 493, 494, 497 లో మట్టి తరలించడానికి అనుమతులు ఇవ్వవద్దని పెద్దపల్లి ప్రెస్ క్లబ్ ద్వారా ప్రకటనలో అధికారులను కోరారు.

## చీరలు ఉత్పత్తిని అడ్డుకుని ప్రభుత్వాన్ని బదణం చేస్తున్నారు...



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సిరిసిల్ల పవర్లూమ్ పరిశ్రమలో ప్రభుత్వానికి సంబంధించిన ఇందిరా మహిళా స్వశక్తి చీరల ఉత్పత్తిని ఆపి ప్రభుత్వాన్ని రాష్ట్రవ్యాప్తంగా బదనాం చేయడంలో భాగంగానే అనేక రకాల కొరివిలు పెడుతున్నారని వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల జేఏసీ నాయకులు పంతం రవి మూషం రమేష్ లు విమర్శించారు. శుక్రవారం బ్యాక్ బిల్లింగ్ సర్ చార్జీలు ఇతరత్రా బిల్లుల పేరుతో వేధింపులకు నిరసనగా వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సిరిసిల్ల సెస్ కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడారు.ఈ నాలుగు మాసాల్లోనే నాలుగు సార్లు పవర్లూమ్ పరిశ్రమలకు విద్యుత్ కనెక్షన్లు తొలగించడం జరిగిందని మండిపడ్డారు. గత నాలుగు రోజుల క్రితమే సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిరిసిల్లకు వచ్చిన సందర్భంగా సిరిసిల్ల సెస్ పాలకవర్గానికి ఇక్కడి వస్త్ర పరిశ్రమ వారు చెల్లించాల్సిన బ్యాక్ బిల్లింగ్ విషయం పై మంత్రి దృష్టికి తీసుకెళ్లగా వారు సానుకూలంగా స్పందించి రెండు మూడు రోజుల తర్వాత జరిగే అసెంబ్లీ కేబినెట్ సమావేశంలో ఈ సమస్య పరిష్కారం అయ్యే విధంగా సెస్ పాలకు వర్గానికి డబ్బులు చెల్లించే విధంగా చర్యలు చేపడతామని సభాముఖంగా చెప్పడం జరిగిందని అన్నారు. ఈ విషయం సెస్ పాలకవర్గానికి కూడా తెలుసని అయినా సెస్ పాలకవర్గం బిఆర్ఎస్ ఆధీనంలో ఉండడంతో ఇక్కడి నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే కేటీ రామారావు ఆదేశాలతో ప్రభుత్వాన్ని బదనాం చేసే ప్రయత్నంలో భాగంగానే ప్రభుత్వ నికి సకాలంలో చీరలను అందకుండా చేసి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వాన్ని బదనాం చేసే దురుద్దేశంతోనే పవర్లూమ్ పరిశ్రమకు విద్యుత్తు కనెక్షన్లు తొలగిస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆడెపు భాస్కర్, దూడం శంకర్, తాటి పాముల దామోదర్, బండారి అశోక్, ఏనుగుల ఎల్లయ్య, బూట్ల నవీన్, ఎల్లండి దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు భాష అమృత బాష కావాలి



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** కరీంనగర్‌లోని వాగేశ్వరి డిగ్రీ పిజి కళాశాలలో శుక్రవారం తెలుగు బాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వైస్ ప్రిన్సిపల్ చెన్నమల్ల చైతన్య హాజరై మాట్లాడారు. ఈ రోజుల్లో తెలుగు బాష మృతబాషగా మారుతుందని, అలా మారితే మన జీవన ఉపాధి, మన సంస్కృతి, సాంప్రదాయాలు దెబ్బ తింటాయన్నారు. మన బాష ఎల్లప్పుడూ అమృత బాషగా విరాజిల్లాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్క విధ్యార్థి తెలుగులో ఉన్నటువంటి మూలాలను, పద్దతులను ఆచరించి అమ్మలాంటి బాషను కనుమరుగయ్యే విధంగా కాకుండా ఉన్నతమైన స్థితిలో ఉంచాలన్నారు. ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలని కోనియాడారు. అందులో ప్రతి విధ్యార్థి పాత్ర చిరస్మరణీయంగా గొప్పగా నిలవాలన్నారు. ప్రతి విధ్యార్థి తెలుగు బాషను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గవ్వ కమలమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గవ్వ వంశీధర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తెలుగు అధ్యాపకులు కుందేటి సత్యనారాయణ, చిన్న సోనియా, మాలతి, స్వప్న, పిడి అనిల్, లావణ్య, లింగంపల్లి రమేష్, వెంకటస్వామి, తిరుపతి, అధ్యాపక , అధ్యాపకేతర బృందం, విధ్యార్థులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులకు టిబి అవగాహన సదస్సు




**ప్రజాపక్షం/కొత్తపల్లి:** పంచాయతీ కార్యదర్శులకు టిబి వ్యాధిపై మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి, జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు క్షయ నివారణ, టిబి అలర్ట్ ఇండియా, ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ సంయుక్తంగా టిబి వ్యాధిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా క్షయ నివారణ అధికారి డా.రవీందర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ క్షయ వ్యాధితో బాధపడే వారు తగు జాగ్రత్తలు వహించి ఇతరులకు వ్యాధి రాకుండా ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వం ఉచిత వైద్యం అందిస్తుందని, ఏవైనా లక్షణాలు కనిపిస్తే నిర్ధారణ పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. కరీంనగర్ జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా మార్చడమే ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశ్యమని ప్రాజెక్టు కో ఆర్డినేటర్ పురుషోత్తం తెలిపారు. కార్యక్రమంలో డిటిఎం కె.సురేందర, హెల్త్ సూపర్‌వైజర్లు, టిబి అలెర్ట్ ఇండియా సిబ్బంది వనిత, శ్రీను, రాజేందర్, అనిల్, పారిజాతం, రాజబోను, పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.

## సుందరగిరి వెంకన్న ఆలయంలో ఏసిపి ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/చిగురుమామిడి:** చిగురుమామిడి మండలంలోని సుందరగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఏసిపి సొడారపు సదానందం, ఆయన సతీమణి తులసి కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం స్వామివారికి అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు ఆచరించారు. ఆలయ చైర్మన్ చొల్లేటి శంకరయ్య అర్చకులు శేషం శ్రీనివాసాచార్యులు, ఏసిపి దంపతులకు ఘన సన్మానం చేసి తీర్థ ప్రసాదాలు అందించారు. ఏసిపి సదానందం మాట్లాడుతూ కోరిన కోరికలు వెంటనే తీర్చే సుందరగిరి శ్రీ వెంకటేశ్వర స్వామివారిని కుటుంబ సభ్యులతో దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని వారు పేర్కొన్నారు.

## పదవీ విరమణ పొందిన ఎంఈవోకు ఘనంగా వీడ్కోలు



**ప్రజాపక్షం/రామడుగు:** మండల ఎంఈవోగా సేవలందించిన అంబటి వేణు కుమార్ శుక్రవారం పదవీ విరమణ చేస్తున్న సంధర్భంగా ప్రైవేట్ పాఠశాలల కరెస్పాండెంట్లు ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ ఎంఈవోగా ఆయన ఎలాంటి విభేధాలు లేకుండా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉన్నతికి ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల కరెస్పాండెంట్లు జగన్మోహన్ గౌడ్, ఉప్పు శ్రీనివాస్, మునీందర్, కిరణ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులున్నారు.

## జగ్గయ్యపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/జమ్మికుంట:** కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆద్వర్యంలో శుక్రవారం జమ్మికుంట మండలం జగ్గయ్యపల్లి గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 140 మందికి ఆసుపత్రి వైద్యులు సాయి కిరణ్ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి షుగర్, బిపి, ఇసిజి పరీక్షలు చేపట్టి రోగ నిర్ధారణ చేశారు. ఈ సంధర్భంగా మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ జగ్గయ్యపల్లి గ్రామ ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ఈ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో 24 గంటలు సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, వీరేశం, రాజమౌళి, రవి, ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, శ్రీకాంత్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ సివిల్ జడ్జి ఆధ్వర్యంలో బాల సదన్, శిశు గృహ సందర్శన

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలకు అనుగుణంగా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ , సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్ ఆద్వర్యంలో పట్టణంలోని బాల సదన్, శిశుగృహాలను సందర్శించారు. చిన్నారులతో ముచ్చటిస్తూ కష్టపడి చదువుకుని ప్రథమస్థానంలో ఉత్తీర్ణత సాధించాలన్నారు. బాలసదన్ పిల్లలతో క్రీడా దినోత్సవం సంధర్బంగా ప్రతిజ్ఞ చేయించారు. శిశు గృహాలలోని వంట , ఆహార పదార్థాలను నిలువచేసే గదులను తనిఖీ చేశారు. పిల్లలను క్రమశిక్షణను అలవర్చుకోవాలని, శిశు గృహాలలోని పిల్లల ఆరోగ్య సమస్యలపై శ్రద్ధ వహించాలని కోరారు. ఈ సంధర్బంగా పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. ఎలాంటి న్యాయపరమై , న్యాయ సేవ అవసరమైనా సంప్రదించాల్సిందిగా ఆదేశించారు. ఉద్యోగ కొరత ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జితో పాటు లీగల్ ఎడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్, శిశు గృహ, బాలసదన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా అన్నారు. పెద్దపల్లి మండలం కుర్మపల్లిలో శుక్రవారం రూ. 33 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే విజయరమణా రావు శంఖుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు మంజూరు పట్టారాలను పంపిణీ చేసి ఇండ్ల నిర్మాణాలకు ముగ్గు పోసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికీ అందిస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి, సంక్షేమం రెండూ ముందుకు సాగిస్తామని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పని చేస్తానని చెప్పారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే తాను బలపరిచిన అభ్యర్థులను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస్, హౌజింగ్ ఏఈ లక్ష్మణ్, రజిత, ఝాన్సీ, సంతోష్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/ముస్తాబాద్ :** హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ పుట్టిన రోజు సందర్భంగా భారతదేశమంతా జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించుకుంటారని, హాకీ మన జాతీయ క్రీడ కావడానికి ధ్యాన్ చంద్ ఎంతో కృషి చేశారని, అతని సారథ్యంలో మన దేశం ఒలింపిక్స్ క్రీడలో హాకీ జట్టు వరుసగా బంగారు పతకాలు గెలుచుకుందని, ప్రపంచ దేశాల్లో మన క్రీడా ఔన్నత్యాన్ని చాటి చెప్పాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిమ్మ రాజిరెడ్డి అన్నారు. ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రాజశేఖర్, సీనియర్ ఉపాధ్యాయులు శ్రీమతి పద్మ, రవీందర్, ఆనందం, రాజ్ మహ్మద్, లక్ష్మణ్, ఎల్లారెడ్డి, శంకరయ్య, రాజిరెడ్డి, భిక్షపతి, గోవర్ధన్, వీర స్వామి, శ్రీనివాస్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సెర్ప్ సిబ్బంది బదిలీలు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సీఈవో హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు చేశారు. జిల్లాలోని ఎల్ 2, ఎల్ 1, ఎంఎస్ సీసీఎస్ 53 మంది ఉద్యోగులకు శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం మినీ సమావేశ మందిరంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కౌన్సిలింగ్ నిర్వహించి, బదిలీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ శేషాద్రి, అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు పనిముట్లు బహుకరణ

**ప్రజాపక్షం/వేములవాడ:** వేములవాడ ప్రభుత్వ పాఠశాలకు వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్న వేషాల అంజయ్య శుక్రవారం ప్రభుత్వ పాఠశాల లో వివిధ తోట పనుల నిమిత్తం పనిముట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ప్రభుత్వ పాఠశాల హెడ్మాస్టర్ రాజారత్నం, ఫిజికల్ డైరెక్టర్ హమీద్, మల్లేశం, కోటేశ్వర్, సతీష్ మరియు చంద్రమౌళి, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## బూరుగుపల్లి పరమేష్ ఆధ్వర్యంలో మండల పర్యటన



**ప్రజాపక్షం/ వేములవాడ రూరల్:** గత రెండు రోజులుగా కురుస్తున్నటువంటి భారీ వర్షాల నేపథ్యంలో రూరల్ మండలంలోని మల్లారం గ్రామం వద్ద కలువట్లు పైనుండి ప్రవహిస్తున్న నీటిని మరియు మూలవాగు పై నిర్మించిన పలు చెక్ డ్యాంలను వేములవాడ రూరల్ బిజెపి మండలాధ్యక్షులు బూరుగుపల్లి పరమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొలాలలో మరియు ఇండ్ల వద్దనున్న కరెంటు పోల్స్ వద్ద అప్రమత్తంగా ఉండాలని వినాయక మండపాల వద్ద విద్యుత్ తీగల నుండి ప్రమాదం జరగకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ అధికార ప్రతినిధి సుంకరి నరేందర్ ఉపాధ్యక్షులు లింగంపల్లి కుంటయ్య, పల్లికొండ నారాయణ, గుంటి వంశీకృష్ణ, కార్యదర్శి గుమ్మడి శ్రీనివాస్, మందా రాజేందర్, బూత్ అధ్యక్షులు నల్ల వెంకటరెడ్డి, ఆది జలంధర్, సీనియర్ నాయకులు గోపు ప్రవీణ్, దాన తిరుపతి పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 2న గ్రామ పంచాయతీ తుది ఓటర్ జాబితా!



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సెప్టెంబర్ 2న గ్రామ పంచాయతీ తుది ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితా ప్రచురించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ గ్రామ పంచాయతీ ఓటర్ లిస్ట్, పోలింగ్ కేంద్రాల లిస్ట్ పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితా అప్ డేట్ చేయడం జరుగుతుందని అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 12 మండలాల పరిధిలో 260 గ్రామ పంచాయతీలలోని 2268 వార్డులలో 3,52,134 ఓటర్లతో డ్రాఫ్ట్ ఓటర్ జాబితా ఆగస్టు 28న విడుదల చేసి గ్రామపంచాయతీ కార్యాలయాలలో అంటించడం జరిగిందని అన్నారు.జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ వారిగా డ్రాఫ్ట్ ఓటర్ జాబితా తయారు చేశామని, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు ఈ జాబితా పరిశీలించి ఏదైనా అభ్యంతరాలు ఉంటే ఆగస్టు 30 లోపు తెలియజేయాలని , ఆగస్టు 31 లోపు వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించి సెప్టెంబర్ 2న తుది ఓటర్ జాబితా ప్రచురించడం జరుగుతుందని అన్నారు.ప్రతి మండలం పరిధిలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు 2268 డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాల జాబితా ఎంపీడీవో ఆగస్టు 28న తయారు చేశారని, వీటిపై అభ్యంతరాలను ఆగస్టు 30 లోపు ఎంపిడిఓ కార్యాలయంలోఅందించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి షరీఫుద్దీన్, డివిజనల్ పంచాయతీ అధికారి నరేష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాచీన భాషగా తెలుగు తేజస్సును లోకానికి చాటుదాం



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** వేల ఏండ్ల చరిత్ర గలరురల్ప్రాచీన భాష తేట తెలుగులో ఎన్నో విశిష్ట లక్షణాలు ఉన్నాయని, ఆ తేజస్సును ప్రపంచానికి చాటి చెప్పాల్సిన బాధ్యత ఈతరంపై ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. పెద్దపల్లి మండలం మూలసాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తెలుగు భాష దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. వ్యవహారిక భాషోద్యమకారుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వాడుక భాషా ఉద్యమానికి మూలపురుషుడైన గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన భాషా సేవను మననం చేసుకున్నారు. కమ్మనైన అమ్మ భాషను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సర్దార్ అబ్దుల్ హైజావీద్, దబ్బెట రాములు, కూకట్ల తిరుపతి, సాదుల వెంకటేశ్వర్లు, అంకతి సంజీవ్, లోకె సదానందం, బాదం జ్యోతి, మానుపాటి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ఆగస్టు 29 జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గాయత్రి విద్యానికేతన్ లో క్రీడా దినోత్సవం వేడుకలను నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా మనం జాతీయ క్రీడా దినోత్సవం ప్రతి సంవత్సరం ఆగస్టు 29 నిర్వహించుకుంటాము ఈ సందర్భంగా గాయత్రి విద్యానికేతన్ లో పిల్లలకు వాళ్ళ యొక్క జీవితంలో ఆటలు యొక్క ప్రాముఖ్యతను తెలియజేసి ఆటలలో పాటించవలసిన నియమ నిబంధనలను దాని వలన కలిగే ప్రయోజనాలను తెలియజేసి ప్రతిజ్ఞ చేయించారు .ఈ కార్యక్రమంలో పాఠశాలలోని వ్యాయామ ఉపాధ్యాయులైన ఆకుల అజయ్ మరియు బట్టల మంజుల లను సన్మానించడం జరిగింది .ఈ కార్యక్రమంలో గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ సార్ కరెస్పాండెంట్ రజనీ దేవి ప్రిన్సిపల్ విజయ్ మరియు వైస్ ప్రిన్సిపల్ ప్రియాంక పాల్గొన్నారు.

## గణపతి హోమంలో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

**ప్రజాపక్షం/కోరుట్ల:** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని గణేశ నవదుర్గా త్రిశక్తి మాత ఆలయంలో వినాయక నవరాత్రుల సందర్భంగా వినాయకుని ప్రత్యేక అభిషేకాలు, పూజలు, గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. ఈ హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణేష్ నవదుర్గా త్రిశక్తి మాత సేవా సమితి అధ్యక్షులు కటుకం గణేష్, ప్రధాన కార్యదర్శి వడ్లకొండ శ్రీనివాస్‌లు మాట్లాడుతూ వినాయక నవరాత్రులు అత్యంత వైభవంగా జరుపుకోవాలని ఆ వినాయకుని కృపకు పాత్రులు కావాలని కోరారు. హోమం అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గణేశ్ నవదుర్గా త్రిశక్తి మాత సేవా సమితి అధ్యక్షులు కటుకం గణేష్, ఉపాధ్యక్షులు ఎలిగేటి సుమన్, ప్రధాన కార్యదర్శి వడ్లకొండ శ్రీనివాస్, సహాయ కార్యదర్శి మామిడిపల్లి రమేష్, కోశాధికారి ఆడువాల ప్రభాకర్, కార్యకర్తలు గజ్జల శంకర్, గాజుల రమేష్, చింతకింది సత్యనారాయణ, కరెంట్ విజయ్, కార్తీక్, రాంచరణ్, ప్రవీణ్, నరేందర్, అనిల్, సంతోష్ వినయ్, విశ్వతేజ, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## గర్రెపల్లి మోడల్ స్కూల్లో ఆరవ తరగతి నుంచి ఇంటర్ వరకు స్పాట్ అడ్మిషన్స్

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి తెలంగాణ ఆదర్శ పాఠశాల కళాశాలలో స్పాట్ అడ్మిషన్ తీసుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ డా.గొల్లి బల్బీర్ కౌర్ ఒక్క ప్రకటన లో తెలిపారు. శుక్రవారం ప్రిన్సిపాల్ తెలిపిన వివరాల ప్రకారం ఆరో తరగతి నుండి ఇంటర్ వరకు సీట్లు ఖాళీ ఉన్నట్లు తెలిపారు.విద్యార్థులు టీ.సి, బోనఫైడ్,కులం, ఆదాయం సర్టిఫికెట్ లతో పాటు ఆధార్ కార్డు తీసుకొని పాఠశాలలో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 9397034734,9866622545 నెంబర్లు సంప్రదించాలని కోరారు.

## హిందూ సాంప్రదాయ ప్రకారం వానరానికి అంత్యక్రియలు

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ పట్టణంలో ప్రమాదవశాత్తు ఒక వానరం మృతిచెందగా విషయం తెలుసుకున్న స్థానిక శ్రీధర్మశాస్త్ర గోశాల వ్యవస్థాపక అధ్యక్షుడు బండారి సూర్య సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ టి. రమేష్ కు విషయం తెలుపగా తక్షణమే స్పందించి మున్సిపల్ సిబ్బందిని పంపగా వారితో కలిసి హిందూ సాంప్రదాయ ప్రకారం అంత్యక్రియ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పొన్నం మధు, చిట్లవేణి సదయ్య పాల్గొన్నారు. సూర్యను పలువురు స్థానికులు అభినందించారు.

## రెస్క్యూ టీం గాలింపు చర్యలు..

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మానేరు వాగులో గల్లంతైన నాగయ్య అనే వ్యక్తి గల్లంతు కావడంతో రెస్క్యూ టీం రంగంలోకి దిగింది.ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్‌గౌడ్,గంభీరావుపేట ఎస్సై అనీల్ అధ్వర్యంలో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.మూడు రోజులు కావడంతో వర్షం తగ్గ పడతంతో వాగులు,వంకల చుట్టూ పరిసర ప్రాంతాలలో పోలీసులు వెతకసాగారు.ఏది ఏమైన నాగయ్య కుటుంబంలో మాత్రం తీవ్ర దిగ్రాంతులకు లోనగుతున్నారు.

## మండల కేంద్రానికి చేరిన ఎన్నికల సామాగ్రి



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయానికి శుక్రవారం ఎన్నికలకు సంబంధించిన సామాగ్రి చేరింది. ఎప్పుడు ఎన్నికలు వస్తాయని ఎదురుచూస్తూ ఉన్న తరుణంలో ఎన్నికల సామాగ్రి మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి చేరడంతో గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైంది.

## పరామర్శ

**ప్రజాపక్షం/జగిత్యాలః** జగిత్యాల పట్టణంలోని 29వ వార్డులో భీమయ్య మరియు చిన్నభీమయ్య2 ఇండ్లు అర్ధరాత్రి 2 గంటలకు షార్ట్ స్క్యూట్‌తో కాలి పోవడంతో విషయం తెలుసుకున్నమాజీ మంత్రి జీవన్ రెడ్డి ఇంటి యజమానులను పరామర్శించారు. నిత్యావసర వస్తువుల కోసం ఆర్థిక సహాయం అందించారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి అర్ధరాత్రి సంఘటన జరిగిన ఇప్పటికి సందర్శించలేదన్నారు. వెంటనే సందర్శించి ఇండ్లు రిపోర్టు ఇవ్వాలని విద్యుత్ శాఖ రెవెన్యూఅ ధికారులకు సూచించారు.. ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయంతో పాటు కలెక్టర్‌తో మాట్లాడి ఇల్లు మంజూర్ చేయిస్తానని మాజీమంత్రి జీవన్‌రెడ్డి తెలిపారు. వారి వెంట మాజీ కౌన్సిలర్ దుర్గయ్య, రమేష్‌రావు, నక్క జీవన్, కాంగ్రెస్ నాయకులు నీలం పెద్దులు, నాంచారి రాజు, నాయకులు ఉన్నారు.

## తెలుగు భాషా దినోత్సవం

**ప్రజాపక్షం/కోరుట్లః** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని గిడుగు రామ్మూర్తి జన్మదిన సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం తెలుగు విభాగం ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. తెలుగు భాషా యొక్క గొప్పదనం మానవుడు తన భావాలను భాష ద్వారానే ఎదుటి వ్యక్తులకు తెలపడం తన అవసరాలను తీర్చకోవడం జీరుగుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నడికట్ల సందీప్ మాట్లాడుతూ పిల్లలకు విద్యాబోధన మాతృభాషలోనే చక్కగా అర్థమవుతుందని తెలుగు భాషలోనే నవరసాలను చూడగలమని తెలుపుతూ , ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని తెలుగు భాష యొక్క గొప్పతనం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు

## అమ్మవారికి కుంకుమార్చనలు

**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్ః** జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువు దగ్గ ర శ్రీ సూర్య ధన్వంతరి ఆలయంలో శుక్రవారం మాతలు అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, లలిత సహస్ర నామాల స్తోత్రాల పారాయణం చేశారు. అనంతరం అమ్మవారికి ఓడిబియ్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ వడ్ల కొండ రాజన్న, వెద్నాల శ్రీనివాస్, అర్చకులు చిలుకుముక్కు నాగరాజు, మహిళ సమితి సభ్యులు శ్రీనిజ, రజిత, మానస, సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వరదలకు నష్టపోయిన వాడీ గ్రామాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి



**ప్రజాపక్షం/నిజామాబాద్:** భారీ వర్షాలతో హోన్నాజీ పేట్, ముత్యాల చెరువు తెగిపోవటంతో వాడీ గ్రామంలోకి వరదనీరు వచ్చి నష్టపోయిన గ్రామాన్ని యుద్ధ ప్రాతిపదికన నిధులు కేటాయించి ఆదుకోవాలని మాజీ ఆర్టీసీ చైర్మన్, మాజీ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. శుక్రవారం ధర్పల్లి మండలంలోని వాడీ గ్రామం నడిమి తండా, బీరప్ప తండాలను పరిశీలించారు. నష్టపోయిన బాధితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోని నాయకులు, అధికారులు గ్రామాన్ని ఆదుకోవడంలో విఫలమైందన్నారు. ఇళ్లలోకి వర్షపునీరు వచ్చి ఇంట్లో ఉన్న బియ్యం, సామాగ్రి వస్తువులు తడిసిపోయి ఇబ్బందులకు గురవుతున్నారని బీఆర్ఎస్ పార్టీ పక్షాన ఆదుకుంటామన్నారు. వాడీ గ్రామానికి బ్రిడ్జి కోసం బీఆర్ఎస్ సమయంలో నిధులు కేటాయించి మంజూరు చేశామని, ఈ గ్రామానికి గ్రామపంచాయతీ ఏర్పాటుకు కృషి చేశామని, గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామని, దళితబంధు 15 కుటుంబాలకు ఇచ్చి ఆదుకున్నామన్నారు. బీరాఎస్ హయాంలో సంఘాలకు సైతం నిధులు కేటాయించామని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఎలాంటి పథకాలు ప్రజలకు అందలేదన్నారు. రైతులు పంటలు కూడా పోవం బాధాకరమన్నారు. నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహిపాల్ యాదవ్, రాజ్‌పాల్, శివరాం, చందర్‌నాయక్, కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

## కెసిఆర్, హరీష్‌రావులను దోషులుగా నిలబెట్టబోతున్నాం




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** కాళేశరం ప్రాజెక్టు అతి పెద్ద స్కాండలని, గత కేసీఆర్ ప్రభుత్వం సుమారు లక్ష కోట్ల ఖర్చు పెట్టిన ప్రాజెక్టు నిర్వీర్యమైందని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. రూరల్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు వందేళ్లు ఉండాల్సిందని మూడేళ్లకోక కూలిందని, గత ప్రభుత్వం తప్పు చేయలేదని బీఆర్ఎస్ అధ్యక్షులు కేసీఆర్, హరీష్‌రావులు అంటున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై కమిటీ ఇచ్చిన నివేదిక అసెంబ్లీలో పెడుతున్నామని, కేసీఆర్, హరీష్‌రావులు దోషులుగా తేలారని, రేపు జరిగే అసెంబ్లీలో అసెంబ్లీ వేదికగా వారిద్దని దోషులుగా నిలబెట్టబోతున్నామని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి తెలిపారు. కేసీఆర్ ముందు నుంచి ఘోష్ కమిటీని వ్యతిరేకిస్తూ కమిటీ నివేదిక వచ్చిన తర్వాత కోర్టును ఆశ్రయించి నివేదిక నిలిపివేయాలని కోర్టులో పిటిషన్ వేశారని, ఇదంతా చూస్తే బీఆర్ఎస్ గత ప్రభుత్వం కేసీఆర్ తప్పు చేసినట్లు అర్థమవుతుందన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో బిల్లు పెట్టామని , చట్టం చేసి గవర్నర్ పంపితే గవర్నర్ ఒతకం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిచంగా కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ ఇవ్వడానికి వెనకడుగు వేస్తుందన్నారు. బీఆర్ఎస్ బీజేపీ పార్టీలు అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్‌కు మద్దతునిచ్చి పార్లమెంట్‌లో మద్దతు ఇవ్వకపోవటం బీఆర్ఎస్, బీజేపీలకు రిజర్వషన్ల విషయంలో చిత్తశుద్ధి లేదన్నారు. కొత్తగా రిజర్వేషన్లలో ఎవరికి ప్రవేశం ఇవ్వలేదని, బీజేపీ పాలిత ప్రాంత రాష్ట్రాలలో ముస్లింలు బీసీల్లో ఉన్నారి ఈ వంకతో రిజర్వేషన్లు అడ్డుకుంటున్న బీజేపీ వారు పాలించే రాష్ట్రాల్లో ముస్లింలను తొలగించి చూపాలన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు బీసీలకు వ్యతిరేకంగా పని చేస్తున్నాయన్నారు. కొంతమందిని పునఃనివాసం కోసం హోన్నాజీపేట్ గ్రామంలోని హైస్కూల్‌లో ఏర్పాటు చేశామని వారికి ఎప్పటికప్పుడు వైద్యం కోసం క్యాంపు ఏర్పాటు చేశామన్రాను. రెండు రోజుల్లోగా కురిసిన వర్షంతో జరిగే నష్టం విషయంపై నివేదికలు తెప్పించుకుంటున్నామని వారిని వర్షంతో జరిగే నష్టం విషయంపై నివేదికలు తెప్పించుకుంటున్నామని వారిని ప్రజాప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. సమావేశంలో ఐడీసీయంయస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పోలసాని శ్రీనివాస్,సొసైటీ చైర్మన్ రాంచందర్ గౌడ్, ఎఎంసి డైరెక్టర్ బాగారెడ్డి, నరేందర్, రాజలింగం పాల్గొన్నారు.

## వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన సిపి



**ప్రజాపక్షం/ఎడపల్లిః** గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు మహారాష్ట్రలో వరదల కారణంగా నిజాంసాగర్ కెనాల్, గోదావరి నదికి వరద పోటెత్తడంతో రెంజల్ మండలంలోని కందకుర్తి, తాడ్ బిలోలి ప్రాంతాల్లోని వరద ప్రభావిత ప్రాంతాలను పోలీస్ కమీషనర్ సాయి చైతన్య గురువారం పరిశీలించారు. కందకుర్తి గ్రామం వద్ద గోదావరి బ్రిడ్జి, పుష్కర ఘాట్లను, చుట్టు పక్కల ముంపు ప్రాంతాలను ఆయన పర్యవేక్షించారు. నిజాంసాగర్ కెనాల్ నుంచి వస్తున్న భారీ వరద నీటి ప్రవాహంతో కందకుర్తి గోదావరి బ్రిడ్జి ముంపునకు గురైనట్లు ఆయన గుర్తించారు. అదేవిధంగా బైంసా బాసర రోడ్డులో తాడ్ బిలోలి దగ్గర వరద నీటి ప్రవాహాన్ని కూడా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ.. రాబోయే రెండు, మూడు రోజుల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా అత్యవసరమైతే రెంజల్ పోలీస్ స్టేషన్ , డయల్ 100 లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712659700 లకు సంప్రదించాలన్నారు. ఈ పర్యటనలో బోధన్ ఏసీపీ పి.శ్రీనివాస్, బోధన్ రూరల్ సిఐ విజయ్ బాబు, రెంజల్ ఎస్ఐ కె.చంద్ర మోహన్, తహసీల్దార్ సావన్ పాల్గొన్నారు.

## డివైడర్‌ను ఢీకొని యువకునికి తీవ్ర గాయాలు



**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఎడపల్లి మండలంలోని సాటాపూర్ గేటు వద్ద డీవైడర్ ను ఢీకొని తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బోధన్ పట్టణానికి చెందిన షేక్ అన్సర్ అనే యువకుడు టిఎస్16ఈఎ7720 నంబర్ గల బైక్‌పై బోధన్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తూ సాటాపూర్ గేటు వద్ద ప్రమాదవశాత్తు డి వైడర్ ను ఢీకొట్టడంతో బైక్‌పై నుంచి పడి తలకు ముఖానికి చేతులకు తీవ్ర గాయాలై తీవ్ర రక్తస్రావమైంది. ప్రమాద ఘటనను గమనించి స్థానికులు హుటాహుటిన 108లో నిజామాబాద్ గవర్నమెంట్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ ముత్యాల రమ పేర్కొన్నారు.

## రాజన్నను దర్శించుకున్న పరిగి శాసనసభ్యులు డా. రామ్మోహన్ రెడ్డి



**ప్రజాపక్షం /వేములవాడ:** పరిగి శాసనసభ్యులు డా.రామ్మోహన్ రెడ్డి శుక్రవారం రాజన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం కల్యాణ మండపంలో వేద పండితులు, ఆలయ అర్చకులు ఆశీర్వదించి శేషవస్త్రంతో సత్కరించి, లడ్డూ ప్రసాదాన్ని అందజశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్స్పెక్టర్ నూగురి నరేందర్, ప్రోటోకాల్ ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ బొడుసు మహేష్, జూనియర్ అసిస్టెంట్ సింహాచార్యులు, ఎస్పీఎఫ్ సిబ్బంది, ఇతర ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## నీట మునిగిన పంటలు పరిశీలించిన వ్యవసాయ అధికారి

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని ఎర్దండి, కోమటి కొండాపూర్ గ్రామాలలో నీట మునిగిన వరి, మొక్కజొన్న, పసుపు తదితర పంటలను మండల వ్యవసాయ అధికారి ఆకు రాజ్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఎస్సారెస్పి నుండి గోదావరి నదిలో వస్తున్న వరద ఉధృతికి రెండు గ్రామాల్లోని నది సమీపంలోని పంట పొలాలలో నీరు నిలువ చేరింది. దీంతో దాదాపు 500 ఎకరాల లోపు వివిధ పంటలు నీట మునిగి దెబ్బతిన్నట్లు అంచనా వేసినట్లు వ్యవసాయ అధికారి తెలిపారు. మండల వ్యవసాయ అధికారి వెంట ఏఎంసి చైర్మన్ బోరిగం రాజు, ఏఈవోలు రవళిక, సాయి కృప, బాధిత రైతులు ఉన్నారు.

## గణనాథులను దర్శించుకున్న ఎమ్మెల్యే సత్యం

**ప్రజాపక్షం/కొడిమ్యాలః** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం కేంద్రంలో వివిధ యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రతిష్టించిన వినాయక విగ్రహ మండపాలను చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ కొడిమ్యాల మండలంలో ఎంతో భక్తిశ్రద్ధలతో ఘనంగా వినాయకుడి నవరాత్రులు నిర్వహించడంలో యువత చూపుతున్న ప్రత్యేక చొరవను అభినందించారు. ఆ లంబోదరుడి ఆశీస్సులు అందరిపైన ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు గడ్డం జీవన్‌రెడ్డి, కొండగట్టు ఉత్సవ కమిటీ సభ్యులు కోదూరి రాజేష్, జిల్లా యువజన అధ్యక్షులు ముత్యం శంకర్, మాజీసర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ యంపిటిసి జామల్పూరి రాజేశ్వరిరాజేంధర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వినోద్‌రెడ్డి, నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, ప్రసాద్, గోల్కొండ రాజు, గుడి రమణ సాయి, రంజిత్, నిఖిల్, శ్రీనివాస్, నరేష్ తదితరులు పాల్గొన్నారు

## స్థానిక సంస్థల ఎన్నికలకు బిజెపి

**ప్రజాపక్షం/కొడిమ్యాలః** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతి ఒక్క బీజెపి పార్టీ కార్యకర్త గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కరీంనగర్ జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు మండల ఎన్నికల ఇంచార్జ్ వాసుదేవారెడ్డి పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ మండలాధ్యక్షులు బండ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చొప్పదండి నియోజకవర్గంలో అత్యధిక స్థానాలు గెలిచే అవకాశం ఉన్నదని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పార్టీ కార్యకర్తలు నాయకులు ప్రజాప్రతినిధులుగా ఎన్నికై ప్రజలకు సేవ చేయాలని పేర్కొన్నారు

**ప్రభుత్వ పాఠశాల పిల్లలకు సైకిళ్ల పంపిణీ..**

నాచుపల్లి గ్రామంలోని హైస్కూల్లో 12 మంది పదవ తరగతి విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చి రాములు, సాయిబాబా, మహేంధర్, సుధాకర్, అంజన్‌కుమార్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.